క్లుప్తంగా

సన్మానం



మల్హర్ : మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు బదిలీపై జీపీఓలుగా వెళ్తున్న సిబ్బందిని తహసీల్దార్ రవికుమార్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్, నరేష్, రాజు, మానస, స్వర్ణలతను తహసీల్దార్ శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, టైపిస్ట్ సునీత లత, ధరణి ఆపరేటర్ సంతోష్ పాల్గొన్నారు.

ముంపు నష్టంపై సర్వే



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి ఉప్పొంగడంతో వరద పత్తి, వరి పంటల్లోకి చేరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. శనివారం వ్యవసాయాధికారులు పంటనష్టంపై సర్వే చేశారు. వారి వెంట నాయకులు మానెం మహేష్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మోటారు ఏర్పాటు



కాటారం : మండల కేంద్రంలోని గారెపల్లి అంబేడ్కర్ కాలనీలో తాగునీటి బోరుకు శనివారం నూతన మోటారు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం బోరు మోటార్ రిపేర్‌కు రావడంతో కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకుడు చీమల రాజు నూతన మోటార్ ఏర్పాటు చేశారు. తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు చీమల రాజుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టె శ్రీహరి, మంత్రి నరేశ్, ప్రభాకర్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

మద్యం సీజ్.. ఒకరిపై కేసు



భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని మంజూర్ నగర్‌లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (జీరో మద్యం) విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం భూపాలపల్లి ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 25లీటర్ల జీరో మద్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ రమ్య తెలిపారు. మంజూర్‌నగర్‌లోని ఉప్పుల శ్రీను ఇంటి ఆవరణంలో తనిఖీలు చేపట్టగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ లభించిందన్నారు. శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ మద్యం మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి తీసుకువచ్చినట్లు అధికారులు అనుమానిస్తున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో ఎస్సై రబ్బానీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ : మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆర్చి గేటు ప్రారంభోత్సవానికి నేడు (ఆదివారం) ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కోటంచ ఆలయం మూసివేత

రేగొండ : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నేడు (ఆదివారం) ఉదయం 11 గంటలకు మూసి, సోమవారం ఉదయం 7గంటల నుంచి స్వామి వారి దర్శనాలు కల్పించనున్నట్లు ఈఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

పండ్ల పంపిణీ

ఏటూరునాగారం : ఏటూరునాగారం మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సలీంఖాన్, అయ్యూబ్, ఖలీల్, గౌస్, మిలాద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానేరులో కష్టాలు తీరేదెన్నడో!



మానేరులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



మానేరులో నిర్మించిన మట్టి రోడ్డు (ఫైల్)

- నిలిచిన వంతెన నిర్మాణం పనులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బంది

టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లి–ఓడేడ్ మానేరులో వంతెన నిర్మాణానికి 2016లో పనులు ప్రారంభించారు. కానీ అర్ధాంతరంగా పనులు నిలిచిపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సంవత్సరం మానేరులో మట్టి రోడ్డు నిర్మించడంతో ప్రయాణికులు సుమారు ఎనిమిది నెలల పాటు మట్టి రోడ్డు ద్వారా ప్రయాణిస్తుంటారు. కానీ ప్రతీ ఏటా జూన్, జూలైలో వర్షాలు మొదలవడంతో మానేరులో వరదలు పొంగుతాయి. దీంతో ప్రయాణికులకు కష్టాలు మొదలవుతాయి. నిత్యం మానేరు దాటి పెద్దపల్లి, మంథని, గోదావరిఖని, మంచిర్యాల, తదితర పట్టణాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. ప్రతీ రోజు వందల సంఖ్యలో వాహనాలు సైతం ప్రయాణిస్తుంటాయి. రవాణా సౌకర్యార్థం గత ప్రభుత్వం అంతర్‌జిల్లా వంతెనకు నిధులు కేటాయించినప్పటికీ కాంట్రాక్టర్ పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు మానేరులో వరద ఉధృతి పెరగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

పెరిగిన దూరభారం..

మండల కేంద్రంనుంచి మానేరు దాటి పెద్దపల్లి, మంథని, గోదావరిఖని, మంచిర్యాల తదితర పట్టణాలకు వెళ్లే అవకాశం ఉంది. సుమారు 50 కిలోమీటర్ల దూరంలో గోదావరిఖనికి చేరుకుంటారు. కానీ మానేరు నుంచి వెళ్లలేని సమయంలో మండల కేంద్రం నుంచి వావిలాల, కాల్వశ్రీరాంపూర్ నుంచి ప్రయాణిస్తే అదనంగా సుమారు 20–30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. మండల కేంద్రం నుంచి మానేరు మీదుగా ఓడేడ్ 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం కాల్వశ్రీరాంపూర్ మీదుగా ప్రయాణం చేస్తే 40 కిలోమీటర్ల దూరం వెళ్లాలి. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేయించాలి. దీంతో ఓడేడ్–గర్మిళ్లపల్లి మానేరులోని అంతర్‌జిల్లా వంతెన నిర్మాణం పూర్తవుతుందని ఇరు నియోజక వర్గాల ప్రజలు కోరుతున్నారు.

పాలకులు పట్టించుకోవాలి



ఓడేడ్–గర్మిళ్లపల్లి మానేరులోని అంతర్‌జిల్లా వంతెన నిర్మాణానికి పాలకులు పట్టించుకోవాలి. పనులు ప్రారంభించి పదేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు వంతెన నిర్మాణంపై పాలకులు దృష్టి సారించడం లేదు. దీంతో వంతెన నిలిచిపోయింది. ఇదిపూర్తయితే నిత్యం రవాణాతో గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతాయి. ఇప్పటికైనా అధికారులు, కలెక్టర్లు స్పందించి కాంట్రాక్టర్‌చే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– సరికొమ్ముల రవీందర్, టేకుమట్ల

ప్రజా సంక్షేమమే ప్రధాని లక్ష్యం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

మొగుళ్లపల్లి : దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పని చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోరె రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించి ప్రజలపై ఆర్థిక భారాన్ని మరింత తగ్గించినందుకు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. జీఎస్టీ స్లాబ్‌లను భారీగా తగ్గించి దేశ ప్రజలకు ముందే దీపావళి పండుగ వాతావరణాన్ని కల్పించారన్నారు. దేశాభివృద్ధి, దేశానికి వస్తున్న పేరు ప్రతిష్ఠలు చూసి అగ్రరాజ్యమే వణికిపోతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోరె వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమ్మరి లచ్చమ్మ సారయ్య నాయకులు పోతుగంటి సాయిలు, బండారి శ్రీనివాస్, అరికాంతపు కృష్ణారెడ్డి భిక్షపతి, వంగ రవి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బూత్‌కమిటీలతో బీజేపీ నాయకులు

బూత్ కమిటీల నియామకం

భూపాలపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ రూరల్ అధ్యక్షుడు పులుగుజ్జు రాజు ఆధ్వర్యంలో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం, దూదేకులపల్లి, దీక్షకుంట గ్రామాల్లో బూత్ కమిటీల ఎన్నుకున్నారు. దీక్షకుంట బూత్ అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి, దూదేకులపల్లి రవిరాజా, గొల్లబుద్దారం మూగల సుధాకర్, 74వ బూత్ అధ్యక్షుడిగా గుగులోతు రాజు నియమించారు. బూత్ కమిటీలు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఉపాధిహామీ డబ్బులు చెల్లించాలి

చిట్యాల : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేసిన కూలీలకు డబ్బులు చెల్లించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి నుంచి జూన్ వరకు ఉపాధిహామీ కూలీలు ఎండను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తే ఇంతవరకు డబ్బులు మంజూరు చేయలేదని తెలిపారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతోనే కూలీలకు సకాలంలో డబ్బులు అందజేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధిహామీ పనుల చేసిన కూలీలకు వెంటనే డబ్బులు మంజూరు చేసి ఖాతాలో జమ చేయాలని కోరారు.

‘బీఆర్ఎస్, బీజేపీ ఆరోపణలు అవివేకం’



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం : యూరియా పంపిణీపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పూర్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు కావాల్సిన యూరియాను అంచనా వేసి రాష్ట్రాలకు సరిపడా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంటుందన్నారు. యూరియాకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేకున్నా యూరియా కొరతను రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబుకు అంటగట్టి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం అవివేకం అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి రైతుల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తోందన్నారు. యూరియా ఆలస్యంపై పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంగీకరించిన విషయం స్థానిక బీజేపీ నాయకులు గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. పుట్ట మధు, చల్ల నారాయణరెడ్డి మతిభ్రమించి మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబుపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రైతులను తప్పుదోవ పట్టించి అశాంతి నెలకొనేలా కుట్రలు చేస్తున్నారని ప్రజల చేతిలో శిక్ష తప్పదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ఆంగోత్ సుగుణ, కుంభం రమేశ్‌రెడ్డి, వంశీవర్ధన్‌రావు, కొట్టె ప్రభాకర్, మంత్రి నరేశ్, చీమల రాజు, జాడి మహేశ్వరీ, కుంభం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ



మొగుళ్లపల్లి: జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సురేందర్



కాటారం: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

మల్హర్ : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫొటో ఎలక్టోరల్ రూల్స్, పోలింగ్ స్టేషన్ ఓటరు జాబితాను శనివారం ఎంపీడీఓ శ్రీరామ్మూర్తి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితా అభ్యంతరాలు గ్రామ పంచాయతీ, వార్డులు మారినవి ఉంటే కార్యాలయంలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఓటర్లను కోరారు. ఈనెల 8 (సోమవారం) వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మహేందర్

రేపు పార్టీ నాయకులతో సమావేశం

మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో రేపు (సోమవారం) ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఉదయ 11గంటలకు నిర్వహించే సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కాళేశ్వరం : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ జాబితాను పంచాయతీ అధికారులు శనివారం ప్రదర్శించారు. ఎటువంటి అభ్యంతరాలు ఉన్న 8వ తేదీ వరకు మహదేవపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఆయా పంచాయతీల కార్యదర్శులు పేర్కొన్నారు.

మొగుళ్లపల్లి : మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఓటరు ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ సురేందర్ తెలిపారు. ఓటరు జాబితలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు తెలియజేయాలన్నారు. అలాగే రేపు (సోమవారం) రాజకీయ పార్టీలతో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

కాటారంలో..

కాటారం : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి ప్రదర్శించారు. గ్రామాల వారిగా ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల వివరాలు నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయశ్రీ

చిట్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి ఆదేశాల మేరకు మహిళా సాధికారతపై విద్యార్థులకు శనివారం సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ జయశ్రీ, మహిళా సాధికారత సిబ్బంది (ఉమెన్ హబ్) అనూష, మమత హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల రక్షణ, విద్య కోసం బేటీ బచావో.. బేటీ పడావో పథకం ప్రారంభించారని తెలిపారు. అలాగే మొబైల్ వాడటం వల్ల జరిగే నష్టాలు, ఆడపిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని పోక్సో చట్టం తీసుకువచ్చారని, సోషల్ మీడియా పట్ల జాగ్రత్త ఉండాలన్నారు. మహిళలు ఆపద సమయంలో ఉమెన్ హెల్ప్‌లైన్ 181, వృద్ధులు 14567, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, ఏపీఎం మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



టేకుమట్ల: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ సుధాకర్

టేకుమట్ల : ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులని మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అంకిత భావంతో పని చేసే ఉపాధ్యాయులు సమాజ అభివృద్ధికి బలమైన పునాది వేస్తారని అన్నారు. ఇప్పుడు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఆదర్శంగా తీసుకుని ఎంతో మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలని కోరారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రసాద్ (ఉన్నత పాఠశాల వెలిశాల, హెచ్‌ఎం), పద్మ(ఉన్నత పాఠశాల రాఘవరెడ్డిపేట, హెచ్‌ఎం), శంకర్‌రావు(ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, టేకుమట్ల), కవిత(ఉన్నత పాఠశాల టేకుమట్ల, హెచ్‌ఎం), స్వప్న (కేజీబీవీ ఎస్ఓ, టేకుమట్ల), వెంకటేశ్వర్లు(ప్రాథమిక పాఠశాల, వెలిశాల), ప్రవీన్‌కుమార్(ప్రాథమిక పాఠశాల, రాఘవాపూర్), మాధవి (ప్రాథమిక పాఠశాల, వెల్లంపల్లి), హరికృష్ణ (ప్రాథమిక పాఠశాల రాఘవరెడ్డిపేట), దయాకర్‌రె((ప్రాథమిక పాఠశాల రామకృష్ణాపూర్–టి) ఘనంగా సన్మానించి, మెమొంటోలను అందించారు. మండల కో ఆర్డినేటర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాజేందర్



అవార్డులు అందుకున్న దొనికల రాజేందర్

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దొనికల రాజేందర్‌కు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు అందుకున్నారు. శనివారం జిల్లాలో గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మీల చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. అవార్డు తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ కృషిత

మొగుళ్లపల్లి : మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆర్.భిక్షపతి, లింగంపల్లి రాజేశ్వర్‌రావు, ఎండీ అబ్దుల్‌రహిం, కళ్యాణి, మధుసూదన్, టి.మహేష్, పి.వేణుమాధవ్, బి.రాజ్‌కుమార్, వి.లావణ్యను మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ కుమారస్వామి తెలిపారు.శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు.

అభినందనలు

కాటారం : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ ప్రిన్సిపాల్ జనగామ కృషిత జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడంతో పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన గురుపూజోత్సవంలో భాగంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ చేతుల మీదుగా కృషిత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కృషితకు పలువురు అభినందనలు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

కాటారం : మండల కేంద్రానికి సమీపంలోని సబ్‌స్టేషన్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం..కాటారం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పాడి సత్యంరాజు, తోట శేఖర్ బైక్‌పై సబ్‌స్టేషన్‌పల్లికి వెళ్తున్నారు. భూపాలపల్లి నుంచి మహదేవపూర్ వైపునకు వెళ్తున్న కారు అతివేగంతో బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో సత్యంరాజు, శేఖర్ కిందపడిపోవడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు ఢీకొట్టి వెళ్లిపోగా నస్తూర్‌పల్లి వద్ద పలువురు పట్టుకున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. చికిత్స పొందుతున్న సత్యంరాజు, శేఖర్‌లను మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి షగీర్ ఖాన్ పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

మద్యానికి బానిసై..

- పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



గోపి (ఫైల్)

మొగుళ్లపల్లి : మద్యానికి బానిసై, ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పెద్దకోమటిపల్లిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన బండి గోపి (42) కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎక్కువ కావడంతో వాటిని ఎలా తీర్చాలని మదనపడేవాడు. ఈక్రమం శుక్రవారం అతడు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక తన భర్త మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని గోపి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై రాజేష్

రేగొండ : హైదరాబాద్‌లో జరిగే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో వాల్ పోస్టర్‌ను ఎస్సై రాజేష్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రఘోత్తం మాట్లాడుతూ.. ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్‌లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఫొటో, వీడియోల నూతన టెక్నాలజీపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫొటోగ్రాఫర్లు రఘుపతి, రాజు, కమలాకర్, సుదర్శన్, రాజేందర్, సతీష్, మొగిలి, సురేందర్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మిరపనారు మడుల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న మణి

మల్హర్ : మండలంలోని తాడిచర్లలో మిరపనారు మడులను డివిజనల్ ఉద్యానవన శాఖ అధికారి వై.మణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా 900ఎకరాల్లో మిర్చి సాగవుతందని పేర్కొన్నారు. మిరపకాయలో విత్తన శుద్ధి ఆరోగ్యకరమైన మొక్కల పెరుగుదలను నిర్ధారించడానికి, వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి చాలా ముఖ్యమైందని రైతులకు సూచించారు. ఇది అంకురోత్పత్తిని మెరుగుపరచడంలో, వ్యాధికారకాల నుంచి ముందస్తు రక్షణను అందించడంలో సహాయ పడుతుందని వివరించారు.